

నూకాంబికా.. నమోస్తుతే

ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. 8లో



ప్రగతి పథంలో హార్బర్ 8లో

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. హార్బర్‌కు హంగులు సమకూర్చుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.8/26.5

తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు. ఉరుములతో కూడిన జల్లులు కొన్నిచోట్ల కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

వెంకన్న ఆలయంలో ఘనంగా లక్ష తులసి పూజ



రోలుగుంట: స్థానిక కొండపై గల శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన లక్ష తులసి పూజలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు గ్రామానికి చెందిన మద్దాల కాశీవిశ్వనాథం దంపతులు అన్నవరం దేవస్థానం ప్రసాదాన్ని అందజేశారు. కె.నాయుడుపాలె, మరివలస, కొవ్వూరు తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సమకూర్చారు.

మోదకొండమ్మ పండగకు చాటింపు



మాడుగుల మోదకొండమ్మ ఆలయం వద్ద చాటింపు వేస్తున్న దృశ్యం

మాడుగుల: వచ్చే నెల 18న జరగనున్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగకు ఆదివారం చాటింపు వేయించారు. ఈ నెల 21న అమ్మవారి ప్రతి రూపాలైన ఘటాలను మహారాజుల కోట ఆవరణలో ఉన్న సతకం పట్టు వద్దకు ఊరేగింపుగా తీసుకువస్తారు. నెల రోజుల పాటు అమ్మవారు అక్కడే కొలువు దీరి భక్తులకు దర్శనమిస్తారు. పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.

సందడిగా 'సరుగుడు'



జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందడి వాతావరణం కనిపించింది. విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి అధిక సంఖ్యలో ఇక్కడకు తరలి వచ్చారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే జలపాతంలో జలకాలు ఆడుతూ సందడి చేశారు. కొందరు జలపాతంలో స్నానమాచరించి సమీపంలోని కొండ గుహలో ఉన్న గంగాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు.

21 నుంచి ఐఐపీఈలో సదస్సు

ఏయూక్యాంపస్ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ, స్టోనీ బ్రూక్స్ యూనివర్సిటీ(న్యూయార్క్)తో సంయుక్తంగా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు హైడ్రోజన్, గ్లోబల్ డీకార్బనైజేషన్ ఇండో–యూఎస్ వర్క్‌షాప్ నిర్వహించనుందని ఐఐపీఈ సంచాలకులు ఆచార్య శాలివాహన ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోబల్ డీకార్బనైజేషన్ ప్రయత్నాలలో కీలకమైన అంశంగా నిలిచే హైడ్రోజన్‌పై చర్చించే వేదికగా ఇంధన రంగంలోని పరిశ్రమల ఎగ్జిక్యూటివ్‌ల కోసం ప్రత్యేకంగా ఫోరం రూపొందించామన్నారు. మూడు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా హైడ్రోజన్‌పై ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ, కార్బన్ తక్కువగా ఉండే ప్రత్యామ్నాయాలు, వాతావరణ మార్పు, శిలాజ ఇంధనాలపై సమగ్ర సెషన్లు ఉంటాయన్నారు. విద్య, పరిశోధన కేంద్రాలు, విధాన రూపకర్తలు, నిపుణులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌టీపీసీ మాజీ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) ఉజ్వల్ కాంతి భట్టాచార్య హాజరవుతారు. విశిష్ట అతిథిగా సింహాద్రి ఎన్‌టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ ఎస్.కె.సిన్హా పాల్గొంటారు. స్టోనీ బ్రూక్ వర్సిటీ ఆచార్యుడు దేవిందర్ మహాజన్ గ్రీన్ హైడ్రోజన్, ఎనర్జీ ట్రాన్సిషన్‌లో సరికొత్త పురోగతిని వివరిస్తారు. ఐఐపీఈ ఆచార్యుడు కృష్ణ శ్రీ హైడ్రోజన్ నిల్వచేయడం, రవాణా అంశాలపై ప్రసంగిస్తారు.

మట్టి పరీక్ష.. పొలానికి రక్ష



తుమ్మపాలలో భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరిస్తున్న ఆర్బీకే సిబ్బంది

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- ఎరువులు, పెట్టుబడులు ఆదా
- అధిక దిగుబడులకు ఆస్కారం
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయశాఖ
- ఈ ఏడాది లక్ష్యం 30,709 మట్టి పరీక్షలు

యలమంచిలి రూరల్: గాలిలో దీపం పెట్టి దేవుడిపై భారం వేసినట్టుగానే చాలా మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు భూమిలో ఉన్నాయో..లేవో తెలుసుకోకుండానే వ్యవసాయం చేస్తున్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారుతోంది. ఈ క్రమంలో ఆశించిన దిగుబడులు రాక నష్టపోతున్నారు. జిల్లాలో ఏటా 1,85,825 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. పంట సాగు చేసేముందు ప్రతి రైతు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయించుకోవాలి. పంట కోత ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలి. భూసార పరీక్ష వల్ల ఏ పంట పండించాలో తెలుసుకోవచ్చు. రసాయన ఎరువు ఎంత వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వల్ల భూమికి రక్షగా ఉంటుంది. భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు,వాడే క్రిమిసంహారకాలు,ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. ఆ మార్పుల్ని ఎప్పటికప్పుడు కనిపెట్టి వ్యవసాయం చేస్తేనే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని వారు చెబుతున్నారు. వాస్తవానికి 90 శాతం మంది రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే సాగుచేస్తున్నారు. దిగుబడుల కోసం రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నా ఖర్చుల భారం తప్ప దిగుబడులు పెరగడం లేదు. అంతేకాకుండా వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.ఈ నేపథ్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయాశాఖ సమయాత్తమైంది. శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి భూసార పరీక్షలు ఎంత అవసరమో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. విత్తనానికి ముందు మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలను బట్టి నేలకు పోషకాలు అందించేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.భూసార పరీక్షల విధానంలో కూడా కొత్త పద్ధతులను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. మారిన విధానంలో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్)ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆర్బీకేల్లో ...

ఎరువుల వినియోగంలో అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లోనే భూసార పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించింది. భూమిలో ఉన్న పోషక పదార్థాలే కాకుండా చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా ఈ పరీక్షలు ఉపయోగపడనున్నాయి

సూక్ష్మ పోషకాలే కీలకం

పంటల సాగులో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం,జింక్,ఇనుము,వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ, స్థూల పోషకాలతో పాటు పీహెచ్, సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతోంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.2 శాతం వరకు ఉన్నట్టు గత పరీక్షల నివేదికల ద్వారా అధికారులు గుర్తించారు. పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. దీని ద్వారా భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో వైపు మట్టి నమూనా సేకరించే విధానం పై వీపీఏలు, ఏవోలకు వ్యవసాయాశాఖ జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇచ్చింది. మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు తరలించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు తెలియజేయాల్సిన వివరాలపై సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది 30,709 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా జూన్ నెలాఖరుకు 10 వేల నమూనాలను పరీక్షించాలని నిర్దేశించగా, ఇప్పటి వరకు రెండు వేల మట్టి పరీక్షలు పూర్తి చేశారు.



ప్రయోగశాలలో భూసార పరీక్ష చేస్తున్న సిబ్బంది



వీపీఏలకు భూసార పరీక్షలపై శిక్షణనిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులకు అవగాహన పెరగాలి



భూసార పరీక్షలపై రైతుల్లో అవగాహన పెరగాలి. మట్టి నమూనా పరీక్ష లేకుండా పంట సాగు చేయకూడదు. ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉంది. నేల ఆరోగ్యంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటాం. మట్టి పరీక్షల ఆధారంగానే యాజమాన్యం చేపట్టి పంట దిగుబడులు సాధించాలి. తద్వారా పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుంది. దీనిపై రైతుల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నాం. భూసార ప్రయోగ కేంద్రంలో మట్టికి సంబంధించి ఉదజని సూచిక, నేల స్వభావం, లవణ సాంద్రత, సేంద్రియ కర్బనం, లభ్య పోషకాల స్థాయిని లెక్కిస్తారు. ప్రయోగశాల నుంచి ఫలితాలను బట్టి సిఫార్సులను రైతులు తప్పకుండా పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వచ్చేనెల 4న జరగనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో ఆదివారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న ఎగ్జిట్ పోల్స్, 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రానున్న దృష్ట్యా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. గ్రామాల్లో పోలీసు పికెట్, పెట్రోలింగ్, చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అభ్యర్థుల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లు నిర్వహించడం నేరమని, ఎక్కడైన జరిగినట్టయితే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో స్థానికులు సమాచారం ఇవ్వాలని, వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జిల్లాలో లాడ్జీలు, చౌల్ట్రీలు, కల్యాణ మండపాలు తదితర ప్రాంతాల్లో అపరిచితులు, అనుమానిత వ్యక్తులు సంచరించినట్టయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లు, అనుమానాస్పద గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లు చేపడుతున్నట్టు చెప్పారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. ర్యాలీలు, ఊరేగింపులు, పండగల్లో స్టేజ్ ప్రోగ్రాములకు అనుమతులు లేవని, పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్ అమ్మకాలు అనుమతించకూడదని, బాణసంచా తయారీ దుకాణాలను తనిఖీ చేయాలని, అమ్మకాలపై దృష్టిసారించాలని ఎస్పీ ఆదేశించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దాబాలు, హోటళ్లు, పాన్‌షాప్‌లపై దాడులు నిర్వహించాలని తెలిపారు. జూదం, కోడిపందాలు, కాయిన్ గేమ్, బెట్టింగ్ తదితర చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని, అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించేవారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. ప్రజలను రెచ్చగొట్టే సందేశాలు, నిరాధార ఆరోపణలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయకూడదని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్, ఇతర రికార్డుల్లో నిందితులను గుర్తించి, వారి ప్రస్తుత కార్యకలాపాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, డి.రామవర్మ, ఎం.ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ భవ్య, సీఐలు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, గణేష్, సతీష్, మన్మధరావు, ఎస్ఐలు రామారావు, రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

పంటనష్ట పరిహారం రూ.11.20 కోట్లు

జిల్లాలో మిచాంగ్ తుపాను బాధిత రైతుల ఖాతాల్లో జమ

తుమ్మపాల/రాంబిల్లి: గత ఏడాది డిసెంబర్‌లో విరుచుకుపడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో తీవ్రంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసింది. 27,956 మంది రైతులకు రూ.11.20 కోట్లు పరిహారంగా అందజేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. యలమంచిలి డివిజన్‌లో యలమంచిలి, రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లో పంటనష్టం అధికంగా జరిగింది. వరి, చెరకు రైతులు ఎక్కువగా నష్టపోయారు. జిల్లాలో 6,589 హెక్టార్ల పంట దెబ్బతిన్నట్టు గుర్తించిన అధికారులు 27,956 మంది రైతులను పరిహారం కోసం ఎంపిక చేశారు. డీబీటీ ద్వారా పరిహారం నగదు జమ అవుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాంబిల్లి మండలంలో 612 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్టు గుర్తించి, 2,150 మంది రైతులను పరిహారం కోసం ఎంపిక చేసినట్టు ఏవో సుమంత చెప్పారు. రూ.1,04,12,928 నగదును రైతుల వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేస్తున్నట్టు తెలిపారు.

కురిసిన వర్షం.. పంటకు జీవం



రావికమతంలో కురుస్తున్న వర్షం

అనకాపల్లి: జిల్లాలో పలు మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. నర్సీపట్నం, రావికమతం, రోలుగుంట, మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. ఈ వర్షం పంటలకు జీవం పోసింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 185 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగ శాస్త్రవేత్త వి.గౌరి చెప్పారు. ఈ వర్షాల వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఆమె తెలిపారు. చెరకు,అపరాల పంటలకు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొండెక్కిన చికెన్ ధర

- కిలో రూ.300కి చేరిక

సాక్షి, విశాఖపట్నం : కొన్నాళ్ల నుంచి ఒకింత అందుబాటు ధరలో ఉన్న చికెన్ ఇప్పుడు చిక్కడం లేదు. రెండు నెలల పాటు కిలో చికెన్ రూ.230–260 మధ్య ఉండేది. మూడు వారాల నుంచి స్వల్పంగా పెరుగుతూ తాజాగా రూ.300కి చేరుకుంది. ఈ ఏడాది మార్చి మూడో వారం నుంచే ఎండలు, వడగాడ్పులు తీవ్రంగా ప్రభావం చూపాయి. ఏప్రిల్ నాటికి అవి తీవ్ర రూపం దాల్చాయి. దీంతో ఫారాల్లో పెరుగుతున్న కోళ్లు వడగాడ్పుల ధాటికి పెద్ద సంఖ్యలో చనిపోయాయి. రోజురోజుకూ తీవ్ర వడగాడ్పులు అధికమవుతుండడంతో పౌల్ట్రీ రైతులు కోడి పూర్తిగా ఎదగక పోయినా మార్కెట్‌కు తరలించేవారు. ఫలితంగా చికెన్ రేటు దిగి వచ్చింది. ఇలా కిలో చికెన్ మార్చి ఏప్రిల్ నెలల్లో రూ.230–260కి మించలేదు. మరోవైపు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పౌల్ట్రీ రైతులు ఫారాల్లో కోళ్ల పెంపకాన్ని గణనీయంగా తగ్గించారు. కోళ్లను ఫారాల్లో బ్యాచ్‌లవారీగా పెంచుతారు. కోడి పిల్ల చికెన్‌కు వీలుగా తయారవ్వాలంటే ఏడు నుంచి తొమ్మిది వారాల సమయం పడుతుంది. ఏప్రిల్‌లోనే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో మే నెలలో మరింతగా విజృంభించి కోళ్లు మృత్యువాత పడతాయన్న భయంతో పౌల్ట్రీ రైతులు బ్యాచ్‌లను కుదించారు. దీంతో ఇప్పుడు కోళ్లకు కొరత ఏర్పడింది. డిమాండ్‌కు తగినన్ని బ్రాయిలర్ కోళ్ల లభ్యత లేకపోవడంతో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా ఈనెల ఆరంభంలో కిలో స్కిన్ లెస్ బ్రాయిలర్ చికెన్ రూ.260 ఉండగా ఇప్పుడది రూ.300కి ఎగబాకింది. అంటే 20 రోజుల్లో కిలోపై రూ.40 పెరిగిందన్న మాట! ఫారాల్లో కొత్తగా వేసిన బ్యాచ్‌లు అందుబాటులోకి రావాలంటే మరో మూడు నుంచి నాలుగు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. అందువల్ల కనీసం మరో మూడు వారాల పాటు చికెన్ ధర ప్రియంగానే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరకంటే ఇంకాస్త పెరిగే అవకాశాలూ ఉన్నాయని అంటున్నారు. చికెన్ ప్రియులకు ఈ ధర భారంగానే ఉండనుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో రోజుకు మూడు లక్షలు, ఆదివారాల్లో ఆరు లక్షల కిలోల చికెన్ అమ్ముడవుతుందని అంచనా. బ్రాయిలర్ చికెన్ రేటు కొండెక్కి కూర్చున్న నేపథ్యంలో ఆదివారం ఆ ప్రభావం అమ్మకంపై పడిందని సీతమ్మధారలోని ఓ చికెన్ సెంటర్ నిర్వాహకుడు రామునాయుడు 'సాక్షి'కి చెప్పాడు.

గుడ్ల ధరలూ పైపైకే.. : కోడిగుడ్ల ధరలు కూడా పైపైకే ఎగబాకుతున్నాయి. మార్చిలో వంద గుడ్ల రేటు రూ.425 వరకు ఉండగా, ఏప్రిల్‌లో మరింత క్షీణించి రూ.405కి దిగి వచ్చింది. ఇప్పుడు విశాఖలో వంద గుడ్ల ధర రూ.550కు చేరుకుంది. దీంతో డజను రిటైల్ మార్కెట్‌లో రూ.72కు పెరిగింది.ఇలా ఇటు చికెన్, అటు కోడి గుడ్ల ధరలు ఎగసిపడుతుండడం నాన్ వెజ్ ప్రియులకు రుచించడం లేదు.

సైలెంట్ మోడ్‌లో సీబీఐ.!

నత్తనడకన డ్రగ్స్ కేసు దర్యాప్తు

- మౌనం వహిస్తున్న దర్యాప్తు బృందం
- భారీగా డ్రగ్స్ లభ్యమైనా కనిపించని పురోగతి
- సంధ్యా ఆక్వా ప్రతినిధులను తూతూ మంత్రంగా విచారించిన వైనం
- డ్రగ్స్ తీసుకొచ్చిన సంస్థను గాలికొదిలేసిన సీబీఐ
- ఆధారాలేవీ సేకరించకుండా బ్రెజిల్‌కి ఇలా వెళ్లి అలా వచ్చేసిన సీబీఐ బృందం



సాక్షి, విశాఖపట్నం: ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చి.. భారీగా డ్రగ్స్ పట్టుకున్న సీబీఐ దాని వెనుక ఉన్న పాత్రధారులు, సూత్రధారులను కనిపెట్టే విషయంలో మాత్రం నిర్లిప్తత వహిస్తోంది. మూలాలు శోధించేందుకు బ్రెజిల్ వెళ్లిన బృందాలు కొండని తవ్వి కనీసం ఎలుక జాడ కూడా కనిపెట్టలేకపోయాయి. ప్రధాన పాత్రధారులుగా ఉన్న సంధ్యా ఆక్వా ప్రతినిధులు కళ్లెదుటే ఉన్నా కనీసం సమగ్రంగా విచారించకుండా వదిలేయడంపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రగ్స్ తీసుకొచ్చిన సంస్థపై చర్యలు తీసుకోకుండా గాలికొదిలేయడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మార్చి 19న విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ (వీసీటీపీఎల్)లో 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌తో పాటు పెద్ద ఎత్తున డ్రగ్స్ దిగుమతి రాకెట్‌ని సీబీఐ బట్టబయలు చేసింది. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి బయలుదేరిన షిప్‌లోని కంటైనర్‌లో డ్రై ఈస్ట్‌ని తీసుకొచ్చిన సంధ్యా ఆక్వా సంస్థ.. అందులో డ్రగ్స్ ఎలా వచ్చాయో తమకు తెలీదంటూ బుకాయిస్తోంది. డ్రగ్స్ దొరికిన తొలి రోజున సంస్థ ప్రతినిధులను రెండు గంటల సేపు మాత్రమే సీబీఐ అధికారులు విచారించారు. తమకేమీ తెలీదని చెప్పడంతో వదిలేశారు. తర్వాత ఇంత వరకూ సంధ్యా ఆక్వా ప్రతినిధుల జోలికి సీబీఐ వెళ్లకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రాథమికంగా సంధ్య ఆక్వా ప్రతినిధుల నుంచి కీలక సమాచారం రాబట్టే అవకాశాలున్నా కనీసం ఆ దిశగా సీబీఐ విచారించకపోవడం గమనార్హం. మొత్తం కంటైనర్‌లో వచ్చిన వెయ్యి బ్యాగుల్లో 70 శాతం బ్యాగ్స్‌లో ఉన్న డ్రై ఈస్ట్‌లో కొకైన్, హెరాయిన్, ఓపియం, కొడైన్, మెథలాక్విన్ తదితర డ్రగ్స్ అవశేషాలున్నాయి. ఈ పరిణామాలు చూస్తుంటే 30 శాతం బ్యాగుల్లో పూర్తిస్థాయిలో డ్రైఈస్ట్ లోడ్ చేసి ఒకవేళ పరీక్షలు నిర్వహించినా దొరకవనే ఉద్దేశంతో పక్కా ప్రణాళికలతోనే డ్రగ్స్ తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే సీబీఐకి ఇంటర్‌పోల్ నుంచి సమాచారం రావడంతో ఈ రాకెట్ గుట్టు రట్టు అయింది. పక్కాగా డ్రగ్స్ అక్రమంగా రవాణా చేసినట్లు ఆధారాలున్నా సంధ్యా ఆక్వాపై ఇంత వరకూ సీబీఐ ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడం మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

రిపోర్టులూ మరింత ఆలస్యం.?

తమ దగ్గర ఉన్న కిట్స్ సాయంతో నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో డ్రగ్స్ అవశేషాలున్నట్లు సీబీఐ గుర్తించింది. అయితే ఒక్కో బ్యాగ్‌లో ఎంత మొత్తం డ్రగ్స్ ఉన్నాయి.. ఏఏ డ్రగ్స్ ఎంత మేర ఉన్నాయన్న అంశంపై సమగ్ర నివేదిక కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)కి పంపించారు. అయితే ఇంతవరకూ దీనికి సంబంధించిన రిపోర్టులు రాలేదని సీబీఐ చెబుతోంది. సాధారణంగా ఎఫ్ఎస్ఎల్ నుంచి 10 నుంచి 15 రోజుల్లో నివేదిక వస్తుందని సంధ్యా డ్రగ్స్‌కు సంబంధించిన రిపోర్టు దాదాపు రెండు నెలలు కావస్తున్నా బయటికి రాకపోవడంపైనా సీబీఐ తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

బ్రెజిల్ వెళ్లి ఏం చేశారు..?

మరోవైపు డ్రగ్స్ మూలాలు ఎక్కడ ఉన్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తామంటూ సీబీఐకి చెందిన బృందం బ్రెజిల్ పయనమయ్యాయి. శాంటోస్ పోర్టుకు డ్రై ఈస్ట్ తరలించిన ఓషన్ నెట్‌వర్క్ ఎక్స్‌ప్రెస్ సంస్థతో పాటు కార్గో షిప్ వచ్చిన మార్గంతో పాటు షిప్ ఆగిన పోర్టుల్లో సీసీటీవీ ఫుటేజ్ సేకరించాలని సీబీఐ బృందం బ్రెజిల్ వెళ్లినట్లు తెలిసింది. అయితే దాదాపు 2 నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఎలాంటి ఆధారాలు సేకరించకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. అయితే బ్రెజిల్ నుంచి సీబీఐ బృందం తిరిగి వచ్చేసినట్లు తెలుస్తోంది. కానీ అసలు దర్యాప్తు ఎంతవరకూ వచ్చిందో కూడా సీబీఐ వెల్లడించకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.

ఎక్కడ కంటైనర్ అక్కడే..

రూ.వేల కోట్ల విలువైన డ్రగ్స్ విషయంలోనూ సీబీఐ నిర్లక్ష్యం వహిస్తోంది. ఎక్కడైతే తనిఖీలు నిర్వహించారో ఆ ప్రాంతమైన వీసీటీపీఎల్‌లోనే డ్రగ్స్ దొరికిన కంటైనర్‌ని సీబీఐ సీజ్ చేసి విడిచిపెట్టేసింది. కంటైనర్ టెర్మినల్‌లో కస్టమ్స్ తనిఖీల్లో పట్టుబడిన కంటైనర్లతో పాటు ఈ డ్రగ్స్ కంటైనర్ కూడా విడిచిపెట్టేశారు. ఎర్రచందనం, నిషేధిత వస్తువులతో వచ్చిన కంటైనర్లను వీసీటీపీఎల్‌లోని ఓ ప్రాంతంలో ఉంచేస్తారు. దాదాపు 10 నుంచి 15 ఏళ్లుగా ఈ కంటైనర్లు ఇక్కడే ఉన్నాయి. వాటితో పాటుగా.. డ్రగ్స్ కంటైనర్‌ని కూడా సీబీఐ విడిచిపెట్టేసింది. కస్టమ్స్, వీసీటీపీఎల్ ప్రతినిధుల్ని ఆ కంటైనర్ భద్రపరచాలని సీబీఐ సూచించిందే తప్ప.. తమ తరఫున ఒక భద్రతా సిబ్బందిని కూడా కంటైనర్ వద్ద ఉంచకుండా నిర్లిప్తంగా వ్యవహరిస్తోంది. వీలైనంత త్వరగా డ్రగ్స్ దోషులను బయటకి లాగాలని దర్యాప్తును సీబీఐ త్వరగా పూర్తి చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

అలరించిన 'కాశీవాసి రావయ్య' నాటిక


కాశీవాసి రావయ్య నాటిక ప్రదర్శన

అనకాపల్లి : స్థానిక గవర పాలెం వీవీరమణ రైతు భారతి ఫంక్షన్ హాల్లో ఆదివారం మూడోరోజు ప్రదర్శించిన నాటికలు అహూతులను అలరించాయి. విశాఖ కళాభినయ్ వారు ప్రదర్శించిన 'కాశీవాసి రావయ్య' నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. మానవత్వపు విలువలు లోపిస్తున్న ఈ సమాజంలో ఎవరి తలకి వాళ్లే కొరివి పెట్టుకునే రోజు వస్తుందని, రేపటి రోజును ఈ రోజే ఊహించి రాసిన నాటిక 'కాశీవాసి రావయ్య'. కథాపరంగా సారయ్య కాటి కాపరి. అతని భార్య నూకాలు అతనికి పనిలో సహాయం చేస్తూ ఉంటుంది. ఓ రోజు కారులో నుంచి మల్లెపూవులాంటి దుస్తులతో ఆనందరావు అనే పెద్దమనిషి దిగుతాడు. అతను తన స్నేహితుడు చనిపోయారు.. శవాన్ని తీసుకు వస్తున్నా తగిన ఏర్పాట్లు చేయమని చెపుతాడు. సారయ్యకి అడిగినంత నగదు ఇస్తాడు. ఆ శ్మశానం చెట్టుకి కట్టిన అస్తికల మూటలు చూసి, వాటి కోసం సారయ్యని అడిగి తెలుసుకుంటాడు. శ్మశానంలో జ్ఞాన సముద్రలో ఉన్న శివుణ్ని చూసి ఆనందరావు ముచ్చట పడతాడు. సారయ్యకి, అతని భార్యకి కాశీ వెళ్లాలని ఉందని వారిమాటల్లో గ్రహించిన ఆనందరావు సారయ్య కాశీ వెళ్లడానికి కావలసినంత నగదు ఇస్తాడు. ఎటువంటి హామీలేకుండా అంత నగదు ఇచ్చిన ఆ పెద్దమనిషిని శ్మశానానికి కొచ్చిన శివయ్యగా భావిస్తాడు సారయ్య. ఆ పెద్ద మనిషి ఆనందరావు సారయ్య దగ్గర ఓ మాట తీసుకుంటాడు. శ్మశానానికి వచ్చిన ఏ శవాన్ని పూర్తిగా కాలలేదని నగదు కోసం ఇబ్బంది పెట్టవద్దని మాట తీసుకుంటాడు. సారయ్య మాటిస్తాడు. సారయ్య శవం వచ్చేలోపు మందుతాగి వస్తామని వెడతాడు. సారాతో కడుపు నిండిపోతుంది. ఆనందంతో మనసు నిండిపోతుంది, సారయ్య తాగి వచ్చేసరికి శ్మశానంలో శవం కాలుతూ ఉంటుంది. సారయ్య ఆ పెద్దమనిషి తాలుకా స్నేహితుడి శవాన్ని తన భార్య కాల్చి ఉంటుందని, తాను మద్యంలో పడి లేటుగా వచ్చానని అనుకుంటాడు. అయితే ఎక్కడా శవాన్ని తెచ్చిన జాడలు కనిపించవు. ఆ కాలుతున్న శవం కారులో వచ్చిన పెద్ద మనిషిది అని గమనించడంతో సారయ్యకి గుండె ఆగినంత పని అయిపోతుంది. అప్పుడు కాశీవిశ్వేశ్వరున్ని వేడుకుంటాడు.

మానసిక సమస్యతో యువకుని ఆత్మహత్య

చోడవరం రూరల్: మండలంలోని వెంకన్నపాలెం గ్రామం పిలకవానిచెరువు గట్టున చెట్టుకు ఉరేసుకుని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం వెలుగు చూసింది. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన గనిశెట్టి సన్యాసిరావు కొన్నాళ్లుగా కుటుంబ సమస్యలతో సతమతమవుతూ మానసిక కుంగుబాటుకు గురై చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 14న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరుకోలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతికి చివరకు బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వెంకన్నపాలెం చెరువు వద్ద ఉరేసుకున్న ఉదంతం తెలియడంతో సంఘటనా స్థలికి బంధువులు చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి సన్యాసిరావుగా గుర్తించారు. మృతుడికి భార్య సత్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ప్రగతి పథంలో హార్బర్


ఫిషింగ్ హార్బర్‌లో కొత్తగా వేస్తున్న రోడ్లు

- శరవేగంగా హార్బర్ ఆధునికీకరణ పనులు


హార్బర్‌లో ఆక్షన్ హాలు నిర్మాణం


హార్బర్‌లో నిలిచి ఉన్న మరబోట్లు

మహారాణిపేట: ఉత్తరాంధ్రలో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని తెస్తున్న హార్బర్ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. దీంతో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హార్బర్‌కు అదనపు హంగులు సమకూర్చుతున్నారు. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

వివిధ దశల్లో ఉన్న పనులు ఇలా..

మొత్తం అన్ని పనులను ఏడు దశల్లో చేపట్టాలని నిర్ణయించి ప్రారంభించారు. మొదటి దశలో ప్యాకేజీ యూనిట్/కోల్డ్ చాంబర్, పార్కింగ్ ఏరియా, రోడ్లను రూ.37.26 కోట్లతో చేపడుతున్నారు. రెండో దశలో విద్యుత్ పనులు, మూడో దశలో రెండు ఆక్షన్ హాళ్లు, రిటైనింగ్ వాల్, నాల్గో దశలో ట్రీట్‌మెంటు ప్లాంట్, ఐదో దశలో ఫ్లోటింగ్ జెట్టీ, ఆరో దశలో డ్రెడ్జింగ్ పనులు, ఏడో దశలో టైర్ ఫెండర్లు ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టారు. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో మరి కొన్ని పనులు చేయాలని మత్స్యకారులు ప్రతిపాదనలు సమర్పించారు. ఫ్లోటింగ్ జెట్టీ స్థానంలో శాశ్వత జెట్టి, మూడో ఆక్షన్ హాలు నిర్మించాలని, బీచింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో భేటీలో ఈ విషయాన్ని మత్స్యకారులు ప్రస్తావించారు. ఈ పనులకు అధికారులు ఎస్టీమెంటు వేయించారు. ముందు అనుకున్న దాని కన్నా అదనంగా నిధులు ఖర్చవుతాయి. హార్బర్ ఆధునికీకరణ కోసం ముందు రూ.151.81 కోట్లు నిధులు అవసరమవుతాయని భావించారు. ఇప్పుడు అదనంగా రూ.178.51 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

మంచి పరిణామం



అభివృద్ధి పనులు చేపట్టడం మంచి పరిణామంగా భావిస్తున్నాం. గతంలో లేనివిధంగా హార్బర్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే మత్స్యకారులకు సంబంధించి వివిధ సమస్యలు తీరుతాయి. ఇంకా మరిన్ని కొన్ని సమస్యలు తీర్చాల్సి ఉంది.

– వాసుపల్లి జానకీరామ్, ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సమస్యలు తీరుతాయి



అభివృద్ధి పనులు మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. దీనివల్ల కొన్ని సమస్యలు తీరుతాయని భావిస్తున్నాం. మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. గతంతో పోల్చిస్తే ఇప్పుడు హార్బర్ ప్రగతి పథంలో నడుస్తోంది.

– బర్రి కొండబాబు, బోటు యాజమాని, ఫిషింగ్ హార్బర్

ఇంకొన్ని విన్నవించాం..



మత్స్యకారులకు ఇంకా అనేక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. డాక్‌లో బోట్లు నిలుపుదల చేసుకొని ఎనిమిది కేడిల్ కావాలి. ఆశీల షెడ్డులో రేకుల షెడ్డు కాకుండా పర్మినెంట్ షెడ్డు వేయాలి. జెట్టి 2, 3లో చేపల యాక్షన్ పాట పెట్టుకుంటాం. అక్కడ ఉన్న బోట్లు తొలగించాలి. డ్రైనేజీ వాటర్ సముద్రంలో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరాం.

– సూరాడ సత్యనారాయణ, బోటు యాజమాని,

ఇంటర్ పరీక్ష ఫీజుకు చివరి అవకాశం నేడు

తుమ్మపాల: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్, సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు తత్కాల్(చివరి అవకాశం)లో ఈనెల 20న దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్మీడియెట్ అధికారి బి.సుజాత ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో రూ.3 వేల రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు జరుగుతాయని ఆమె తెలిపారు.

మద్యం సీసాలు తరలిస్తున్న మహిళపై కేసు

అనకాపల్లి: మద్యం తరలిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు ఆదివారం చెప్పారు. వివరాలివి. మండలంలో కోడూరు గ్రామానికి చెందిన వరహాలమ్మ 10 మద్యం క్వార్టర్ సీసాలు తరలిస్తూ అదే గ్రామంలో పట్టుబడిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

'ఎయిడ్స్ రోగుల పట్ల ఆదరణ చూపాలి'


అంతర్జాతీయ ఎయిడ్స్ దీప నృత్యాంజలి దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

తుమ్మపాల: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ఆదరణ కలిగి ఉండాలని, రోగులు ఏఆర్టీ మందులు వాడుతూ తమ జీవితాన్ని పెంచుకోవాలని డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ సూచించారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దీప నృత్యాంజలి దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ(ఎన్టీఆర్) ఆస్పత్రి నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ఎయిడ్స్ వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి ఆత్మ శాంతి కలగాలని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మే నెల 3వ ఆదివారం ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవం జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ ఏఆర్టీ సెంటర్ ద్వారా 5,018 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు మందులు వాడుతున్నట్లు తెలిపారు. గడచిన ఏడాది కాలంలో ఎయిడ్స్ వ్యాధితో 12 మంది మరణించారని, వారికి ఆత్మశాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ ప్రియదర్శని, దిశ సీఎస్‌వో డాక్టర్ సీహెచ్ స్పందన, టీఎంవో డాక్టర్ ధాత్రిప్రియ, ఎన్టీఆర్ హాస్పిటల్ ఐసీటీసీ, పీపీటీసీ సిబ్బంది, యాక్సెస్ట్, ఎస్‌వీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థలు, లింక్ వర్కర్స్ పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ జలాశ్వను సందర్శించిన సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లు


ఐఎన్ఎస్ జలాశ్వ ఓడను సందర్శించిన సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లు

సింధియా: భారత నౌకాదళం కార్యకలాపాలు, సముద్ర వారసత్వం, లైఫ్ ఆన్‌బోర్డ్ షిప్‌లపై సమగ్ర అవగాహనే లక్ష్యంగా సుమారు 100 మంది సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లు తూర్పు నావికాదళానికి చెందిన ఐఎన్ఎస్ జలాశ్వ ఓడను సందర్శించారు. సందర్శన సమయంలో సీ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లకు భారతనౌకాదళానికి చెందిన వివిధ డొమైన్‌లపై సమగ్ర వివరణను ఓడ సిబ్బంది అందించారు. దేశ ప్రయోజనాలను కాపాడటంలోనూ, సముద్ర భద్రతను పోత్రహించడంలోనూ, మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల్లో పాల్గొనడం వంటి నౌకాదళ సిబ్బంది పాత్రపై వివరించారు. అదే విధంగా క్యాడెట్‌లకు నావికుల దినచర్యలు, విధులు, బాధ్యతలతో పాటు పనిలో వారి సంస్కృతి, ఆన్‌బోర్డ్ షిప్‌లలో వారి జీవితం, నేవీలో సేవ చేయడానికి అవసరమైన త్యాగాలు, అంకితభావం గురించి అవగాహన కలిగించారు. యువతకు దేశభక్తిపై జాతీయ గర్వాన్ని అవలంబించే దిశగా సందర్శన ముగిసిందని నేవీ వర్గాలు తెలిపారు.

జూలో ఆఫ్రికన్ కోతులు



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో అరుదైన కోతి జాతులున్నాయి. ఇటీవల శ్రీకాకుళం జిల్లా అటవీ శాఖ అధికారులు వీటిని విశాఖ జూ పార్కుకు అప్పగించారు. అప్పటి నుంచి ఆ కోతులు జూలో సందర్శకులను అలరిస్తున్నాయి. కొందరు ఒడిశా రాష్ట్రం మీదుగా వేరే చోటకు అనధికారికంగా ఆఫ్రికన్ జాతికి చెందిన రెండు కోతులను తరలిస్తుండగా శ్రీకాకుళం జిల్లా అటవీ శాఖ అధికారులకు పట్టుబట్టారు. వీటిని జూకు అప్పగించినట్టు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వీటిని జూలో కోతుల జోన్‌లో ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లో సందర్శకుల కోసం అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాతి కోతులను 'లోయిస్ట్ మంకీస్' అని పిలుస్తారన్నారు. ఈ జాతి ఆఫ్రికా ఖండం కాంగో ప్రాంతంలో సంచరిస్తాయన్నారు. ఈ జాతి కోతులు మన దేశంలో ఎక్కడా కనిపించవని తెలిపారు. ఇవి అరుదైన జాతికి చెందినవని తెలిపారు.

నూకాంబికా.. నమోస్తుతే

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- క్యూ కాంప్లెక్స్‌లు దాటి రోడ్డుపై బారులు తీరిన భక్తులు


నూకాంబికను దర్శించుకుంటున్న పట్టణ ఎస్ఐ సత్యనారాయణ


అమ్మవారి ఘటాలను ఆలయానికి తీసుకు వస్తున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, పిల్లాపాపలతో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వృద్ధులు, గర్భిణుల కోసం ప్రత్యేక దర్శన కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీదళార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టం పజేసి108 స్వర్ణ తులసీదళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

గిజిగా.. మొనగాడవోయి!







అందమున నీకు నీడగు నందగాడు
గృహవినిర్మాణమున నిన్ను గెలుచువాడు
వైభవంబున బోలు దేవతల తోడు
లేడురా గిజిగా! మొనగాడవోయి!..

అంటూ పిచ్చుక గూళ్లను చూసి గుర్రం జాషువా మైమరచి 'గిజిగాడు'పేరిట ఓ ఖండ కావ్యమే సృష్టించాడు. ప్రకృతికి మించిన పాఠం, ఆనందం లేదు. కళ్లు తెరిచి చూడాలి. మనసుపెట్టి వినాలి.. అంతే! బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటలో పచ్చని పొలాల పైన, విద్యుత్ వైర్లను ఆధారంగా చేసుకుని పిచ్చుకలు అల్లుకున్న గూళ్లు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. వర్షాకాలానికి ముందు తమ సంతతిని పెంచుకునేందుకు చెరకు, ఈత, గరిక ఈనెలతో అందంగా పిచ్చుకలు అల్లిన ఈ గూళ్లు తోరణాల్లా, పైర గాలులకు ఊగుతూ అబ్బురపరుస్తున్నాయి.

– బుచ్చెయ్యపేట

ఉక్కు పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన సతీమణి కె.సుజాతతో కలిసి స్టీల్‌ప్లాంట్‌లోని కోక్ ఓవెన్స్, బ్లాస్ట్ ఫర్నేస్, ఎస్.ఎం.ఎస్.తో పాటు రోలింగ్ మిల్స్ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వమన్నారు. కేంద్రంపై ఒత్తిడి చేయక పోవడం వల్లే ప్రధాని మోదీ ఆటలు సాగుతున్నాయన్నారు. ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని, దానిని అమ్మే హక్కు కేంద్రానికి లేదన్నారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం జాతీయ స్థాయిలో ఇండియా కూటమి నేతృత్వంలో ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ నాయకులు జె. రామకృష్ణ, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

• మత్స్యకారుల జీవన 'చిత్రం'









నిరంతరం శ్రమిస్తూ ఏడాదిలో సగానికిపైగా సముద్రంలో ఉంటూ చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ప్రస్తుతం సెలవుల్లో ఉన్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14 వరకు 61 రోజులు సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం అమల్లో ఉండడంతో వారంతా బోట్లు మరమ్మతులు. కొత్త బోట్ల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు వలల సిద్ధం చేసుకుంటున్నారు. జూన్ 15వ తేదీ వేటకు వెళ్లే సమయానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రతిరోజూ మత్స్యకారులంతా బృందాలు వీటి పనుల్లో నిమగ్నమవుతున్నారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

ఘనంగా త్రిపురాంతక స్వామి పెళ్లిరాట


శివాలయం వద్ద పెళ్లిరాట వేస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక పురాతన శివాలయ ఆవరణలోని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి వారి పెళ్లిరాట ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 23న స్వామి వార్ల 108వ కల్యాణోత్సవం జరగనుంది. దీనిలో భాగంగా పెళ్లిరాట ఉత్సవాన్ని నిర్వహించారు. సంప్రదాయంగా నేరేడు కొమ్మను తెచ్చి పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి వేద మంత్రాల నడుమ పూజలు జరిపి, పెళ్లిరాట నిలిపారు. ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.శంకరంల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'పెండింగ్ బకాయిలు చెల్లించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు

తుమ్మపాల: రాష్ట్రంలో విశ్రాంత, విధుల్లో ఉన్న టీచర్ల బకాయిలను వెంటనే చెల్లించేందుకు అధికారులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు కోరారు. పట్టణంలోని రింగు రోడ్డులో ఉన్న పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ, డీఏ బకాయిలను విడుదల చేయాలన్నారు. 2018 నుంచి గ్రాట్యూటీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. 70 ఏళ్లు దాటిన విశ్రాంత సిబ్బందికి వర్తించే క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10 శాతానికి పెంచాలన్నారు. బోధనేతర విధుల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా తొలగించాలని కోరారు. నాడు నేడు, పలు అంశాల్లో పనులను ఇంజినీరింగ్, ఇతర అధికారులకు అప్పగించాలన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు వరు, బాబ్జీ, కామేశ్వరరావు, మూర్తి, గంగాధర్, జనార్దన్, రమేష్ సత్యనారాయణ పాల్గొన్నారు.

21న ఉచిత నేత్ర వైద్య శిబిరం

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి రాజా ఆప్టికల్స్ ఆవరణలో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రాజా ఆప్టికల్స్ ప్రతినిధి పి.రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో పాల్గొనే రోగులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులతో పాటు, శస్త్రచికిత్సలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు

అచ్యుతాపురం : విద్యార్థులు వేసవి సెలవుల్లోనూ కొంత సమయం చదువు కోసం కేటాయించాలని రిసోర్స్ పర్సన్ పి.శివకృష్ణ అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం లెక్కలలో మెళకువలు నేర్పించారు.

అనకాపల్లి సినిమాలు

నటరత్నాలు	: రాజా
మిరల్	: సత్యనారాయణ స్క్రీన్-1
కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ద ఏప్స్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
అపరిచితుడు	: వెంకటేశ్వర
రత్నం	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 103 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-48 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-37 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 214 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

నిర్లక్ష్యం 'పాడి' కాదు!

పాడి సంపదపై ఆధారపడిన రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన సీజన్ ఇది. ఒక వైపు వేసవి ఎండల తీవ్రత ఇంకా తగ్గుముఖం పట్టలేదు. మరోవైపు అడపా దడపా కురుస్తున్న వర్షాలకు పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. ఈ నేపథ్యంలో పాడి రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని పశు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నియోజకవర్గంలో పశు సంపద

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
అనకాపల్లి	8,748	13,676	3,999	6,620
కశింకోట	7,096	10,348	7,410	8,620
మొత్తం	15,844	24,024	11,409	15,240

- వాతావరణ మార్పులతో పశువులపై అదనపు శ్రద్ధ
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో తగ్గుతున్న పాల దిగుబడి
- వడ దెబ్బ, సీజనల్ రోగాలపై ప్రత్యేక చర్యలు


పశువుల సంరక్షణపై మహిళా పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)


చెట్లకింద సేదదీరుతున్న పశువులు

తుమ్మపాల: పాడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండదండలు అందిస్తోంది. పశు సంపద ఆరోగ్య సంరక్షణకు పెద్ద పీట వేస్తోంది. తక్షణ వైద్య సాయం కోసం టోల్ ఫ్రీ నెం.1962కు ఫోన్ చేస్తే చాలు.. అంబులెన్స్ ద్వారా పశు వైద్యులు పాడి రైతు వద్దకే వస్తున్నారు. అవసరమైన వైద్యం అందించి, పశువుల ప్రాణాలు కాపాడుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా చిరు జల్లులు కురుస్తున్నా.. వేసవి ఉష్ణోగ్రతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ తరుణంలో పశువులకు వడదెబ్బ తగలకుండా, పాల ఉత్పత్తి క్షీణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

పశు సంరక్షణలో ప్రత్యేక సూచనలు

- పశువుల కొట్టం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలి.
- పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- కొట్టంలోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి.
- పరిశుభ్రమైన చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి.
- పచ్చగడ్డి, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి.
- సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- గేదెల పాకలు మరింత చల్లగా ఉండేలా పాకలపై వరి గడ్డి, గోనె సంచులు కప్పి, వాటిపై తరచూ నీటిని చల్లుతూ ఉండాలి.
- రోజుకు రెండు మూడుసార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి.
- వీలైనంత వరకు పశువుల పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే కానుగ, బాదం, వేపచెట్లు పెంచుకోవాలి.
- వేసవిలో ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే మేత కోసం పశువులను బయటకు వదలాలి.

పచ్చిమేతే మేలైన పోషణ

వేసవి ఉష్ణోగ్రతలు, మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పశువులకు పచ్చిమేతే శ్రేయస్కరం. పచ్చగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం(మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకు తేమ ఉంటుంది. పాడి పశువుల శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంటకుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలి.

పశు పోషణలో జాగ్రత్తలు అవసరం



మండలంలో వ్యవసాయంతో పాటు చాలా మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం చేసే ప్రతి కుటుంబం ఆవు, గేదెలను కలిగి, చిన్నపాటి షెడ్లను ఏర్పాటు చేసుకుని వాటిని పోషిస్తున్నారు. కొందరు రైతులు చెట్ల కిందనే పశువులను ఉంచుతున్నారు. వేసవి ఉష్ణోగ్రతలతో కొంతమేర పాల దిగుబడి తగ్గింది. వేసవి తీవ్రత పశువులపై పడకుండా చల్లని నీటిని క్రమం తప్పకుండా రోజుకు రెండు మూడు సార్లు పశువులపై చల్లాలి. వడ దెబ్బ తగిలితే తక్షణమే మాకు సమాచారం అందించాలి.

– నిర్మల యాదవ్, వెటర్నరీ వైద్యురాలు, పశు వైద్యశాల, సీహెచ్ఎన్ అగ్రహారం

కమనీయం.. వేణుగోపాలుడి కల్యాణం


రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కశింకోట: దేవదాయ శాఖకు చెందిన కశింకోటలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణి, సత్యభామ, స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పూలమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించి వేద మంత్రోశ్చరణల నడుమ కల్యాణం జరిపించారు. విష్వక్సేన పూజ, యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, సుముహూర్తాన జీలకర్ర బెల్లం పెట్టడం, మాంగల్యధారణ తదితర ఘట్టాలతో కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యుల పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు, కోదండ రామాలయ అర్చకుడు రేజేటి మారుతి తదితరులు కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కార్య నిర్వాహణాధికారి కె.శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణం


సత్యనారాయణస్వామి కల్యాణ మూర్తులు


కల్యాణంలో పాల్గొన్న దంపతులు

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు విద్యాసాగర్ నేతృత్వంలో 12 మంది ఉభయదాతల చేతుల మీదుగా స్వామివారి కల్యాణాన్ని జరిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం మహిళలతో కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేఎం నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ఓటింగ్‌లో పోటెత్తారు

కశింకోట: మండలంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి మించి పోలింగ్ జరిగింది. మండలంలో 71 పోలింగ్ కేంద్రాలుండగా, వాటిలో 17 కేంద్రాల్లో 90 శాతం అంతకంటే ఎక్కువ పోలింగ్ జరిగింది. అసెంబ్లీ నియోజకవర్గంలో 20 కేంద్రాల్లో 90 శాతానికి మించి పోలింగ్ జరగగా, వాటిలో అత్యధిక కేంద్రాలు మండలంలోనే ఉన్నాయి. మండలంలోని పేరంటాలపాలెం శివారు జోగారావుపేటలో అత్యధికంగా ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 617 ఓట్లు ఉండగా, 93.35 శాతంతో 576 మంది ఓటేశారు. మిగిలిన కేంద్రాల్లో 60 నుంచి 80 శాతం మేర ఓట్లు పోలయ్యాయి. అయితే కశింకోటలోని పోలింగ్ బూత్ నెం.50లో మాత్రం అత్యల్పంగా 56.45 శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ 1,116 ఓట్లుండగా 630 మంది మాత్రమే ఓటేశారు. మండలం మొత్తంగా చూస్తే 86.13 శాతం ఓటింగ్ జరిగింది. మొత్తం 55,163 మంది ఓటర్లు ఉండగా 47,515 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా జరగనంత ఎక్కువగా పోలింగ్ జరగడం విశేషం.

అధిక పోలింగ్ జరిగిన కేంద్రాలు

పోలింగ్ బూత్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
సుందరయ్యపేట(8)	1,050	975	92.86
జి.భీమవరం	955	882	92.36
శివారు సింగవరం	589	544	92.36
బంగారయ్యపేట(16)	670	611	91.19
చింతలపాలెం(32)	655	597	91.15
ఏనుగుతుని(23)	684	623	91.08
అమీన్‌సాహెబ్‌పేట(27)	841	766	91.08
కొత్తపల్లి(41)	666	604	90.69
శివారు గోకివానిపాలెం	408	370	90.69
అమీన్‌సాహెబ్‌పేట(28)	834	756	90.65
నూతలగుంటపాలెం(22)	1,152	1,044	90.63
తేగాడ(65)	670	607	90.60
సుందరయ్యపేట(9)	319	289	90.60
మోసయ్యపేట(11)	529	479	90.55
తేగాడ	645	582	90.23
శివారు అచ్యుతాపురం	712	641	90.03

అజాత శత్రువు పుచ్చలపల్లి


సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న లోకనాథం

అనకాపల్లి: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అజాత శత్రువని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కొనియాడారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టుగా నేటి తరానికి సుందరయ్య ఎంతో ఆదర్శప్రాయుడన్నారు. పార్లమెంట్‌లో మొదటి ప్రతిపక్షనేతగా అందరి మన్ననలను అందుకున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవ కోసం పిల్లలే వద్దనుకున్న త్యాగజీవి అని కీర్తించారు. దేశంలో విలువలతో కూడిన రాజకీయాలకు తిలోదకాలిస్తున్న నేటి నాయకులు సుందరయ్య నుంచి నిరాడంబరత, త్యాగనిరతిని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు, నాయకులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరావు, కె.సుజాత, తెల్లయ్యబాబు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూం బయట షార్ట్ సర్క్యూట్

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూం బయట చిన్నపాటి షార్ట్ సర్క్యూట్ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 17న సాయంత్రం ఈదురు గాలులు వీయడంతో స్ట్రాంగ్ రూమ్‌కు వెనుకభాగంలో బట్లపూడి కొండకు ఆనుకుని ఉన్న విద్యుత్ లైన్లు ఒకదానికొకటి తగిలి, షార్ట్ సర్క్యూట్ అయ్యింది. అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ శాఖకు సమాచారం అందించారు. పది నిముషాల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించారు. దీనిపై కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టిని వివరణ కోరగా అది చాలా చిన్న సమస్య అని, ఆ సమయంలో ఇరు పార్టీల నాయకులు అక్కడే ఉన్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూంలకు మూడంచెల భద్రతతో పాటు మల్టీ లెవెల్ సీసీ కెమెరాలతో నిఘా ఉంచామన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం


నేత్రాలయం వైద్యుడు దాడి పరమేశ్వరరావుని సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి:నేత్ర సమస్యలతో బాధపడే వ్యక్తులు ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ తీసుకోవాలని నయన నేత్రాలయం వైద్యుడు దాడి పరమేశ్వరరావు సూచించారు. స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు గుమస్తాల సంఘం కార్యాలయంలో క్లబ్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో కంటి వ్యాధులు, నివారణోపాయాలపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అన్ని వయసులవారు సెల్‌ఫోన్, కంప్యూటర్ ఎక్కువగా వాడడంతో కంటి సమస్యలు వస్తున్నాయని, అలాంటి వారు అల్ట్రావైలెట్ గ్లాస్‌ను కంటికి రక్షణగా వాడాలని సూచించారు. 40 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తి ఏడాదికోసారి కంటి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు అద్దాలను మార్చుకోవాలన్నారు. చిన్నపిల్లలు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడంతో కంటి సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయన్నారు. మరణించిన వ్యక్తికి చెందిన కళ్లను 6 గంటల్లోపు దానం చేస్తే చూపులేని మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చన్నారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు, సభ్యులు రాపేటి నారాయణరావు, డీడీ నాయుడు, ఆడారి మల్లికార్జునరావు, కేవీ గౌరీపతి, కేవీవీ సత్యనారాయణ, నల్లల దేముళ్లు, ఆళ్ల ఓంరామ్, కోటేశ్వరరావు, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు


మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వి. శిరీష కోరారు.సబ్బవరం శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


బొజ్జన్నకొండ వద్ద జీవీఎంసీ చిన్న హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అనకాపల్లి:మండలంలో శంకరం పంచాయతీ బొజ్జన్నకొండ వద్ద పట్టణంలోని జీవీఎంసీ చిన్నహైస్కూల్‌కు చెందిన 1993–94 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయకలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ప్రతినిధి పెంటకోట పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 29 సంవత్సరాల తరువాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గల్ఫ్, అబుదాబి నుంచి పూర్వవిద్యార్థులు వచ్చారు. ఇకపై ఏటా ఫిబ్రవరి 2వ ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కాండ్రేగుల రామలింగేశ్వరరావు, జగన్నాథరావు, బత్తుల నూకేష్, ఆళ్ల శివాజీ, అర్రెపు కాశన్న, షేక్‌చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలు


పక్షుల కోసం సిద్ధం చేసిన వరికుంచులతో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు ఫణిభూషణ్‌శ్రీధర్, సభ్యులు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణ, వేసవిలో ఇంటి గూటి పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందని గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. స్థానిక గాంధీనగరం లయన్స్ క్లబ్ ఆవరణలో గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలను శనివారం రాత్రి ప్రముఖ సంఘ సేవకులు కర్రి సన్యాసినాయుడు, విశ్రాంత అటవీశాఖ అధికారి బీరా వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో స్థాపించిన గ్రీన్‌క్లబ్ ద్వారా సభ్యుల సహకారంతో ప్రతినెల జిల్లాలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు, ఉచిత మొక్కల పంపిణీ, ఇంకుడు గుంతల నిర్వహణ, పక్షుల సంరక్షణ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలంటే ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. అంతకుముందు తునికి చెందిన హరిత వికాస్ పర్యావరణవేత్త పాలుపర్తి దాలినాయుడు వరికుంచెలపై శిక్షణ ఇచ్చారు. పర్యావరణహిత స్టాల్స్ ప్రదర్శన, మహిళలకు ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరరావు, సభ్యులు ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, కర్రి హనుమంతరావు, కేవీ గౌరీపతి, శేషసాయి, సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు


వాడచీపురుపల్లిలో పారామిలటరీ దళాలు

పరవాడ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి త్వరలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న నేపథ్యంలో పారామిలటరీ దళాలు గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. అందరూ సహకరించాలని కోరాయి. పరవాడ ఎస్ఐ సిరపురపు సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు పరవాడ, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పరీక్ష పత్రాలు


సబ్బవరంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపరుస్తున్న పదోతరగతి పరీక్ష పత్రాలు

సబ్బవరం: మండలంలో ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్న పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి బీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ నెల 24 నుంచి ఏడు రోజుల పాటు జరగనున్న పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష పేపర్లు సబ్బవరం చేరుకోవడంతో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పరీక్షలకు 120 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ నిర్వహించనున్నారు. పేపర్లను భద్రపరిచిన వారిలో చీఫ్ సూపరింటెండెంట్ రొంగలి ప్రసాద్‌తో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెలుగు భాషా శిక్షణ

మునగపాక : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నుంచి తెలుగు భాషపై పట్టు సాధించేందుకు అవసరమయ్యే శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని యువ రచయిత విల్లూరి జగ్గప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో రాయడం, చదవడంపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తామన్నారు. తెలుగు భాష అధ్యయన వేదిక పేరుతో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్షరాలు, ఒత్తులు పలికే, రాసే విధానం వంటి విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9182259317 ఫోన్ నంబరును సంప్రదించాలని జగ్గప్పారావు కోరారు.